# దసరా షాపింగ్ బొనాంజా కానుకలు

- నమస్తే..తెలంగాణ టుడే దసరా బొనాంజా మొదటి డ్రా
- లక్కీ విజేతలకు బహుమతులు




వినియోగదారులతో విజేతల ఎంపిక

ఖైరతాబాద్, అక్టోబర్ 2 : తెలంగాణ ఇంటి పత్రిక 'నమస్తే' మరో సారి గ్రేటర్ వినియోగదారులకు దసరా కానుకలను తీసుకొచ్చింది. నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా షాపింగ్ బొనాంజా దశాబ్ద కాలంగా కొనసాగుతున్నది. కేఎల్ఎం ఫ్యాషన్ మాల్, బిగ్‌సీ, ఆల్మండ్ హౌజ్ భాగస్వామ్యంతో, టీవీ పార్ట్నర్‌గా టీన్యూస్, సుమన్ టీవీ డిజిటల్ పార్ట్నర్‌గా దసరా షాపింగ్ బొనాంజా మొదటి డ్రా పంజాగుట్టలోని మానేపల్లి జ్యువెల్లరీస్ వేదికగా జరిగింది. బొనంజాలో మొదటి రోజు ముగ్గురు లక్కీ విజేతలను ఎంపిక చేశారు. విజేతలు మొదటి బహుమతిగా 32 ఇంచుల టెలివిజన్, రెండో బహుమతిగా స్మార్ట్ ఫోన్, మూడో బహుమతిగా గిఫ్ట్ ఓచర్‌ను గెల్చుకున్నారు.

పంజాగుట్ట మానేపల్లి జ్యువెల్లరీస్‌లో దసరా షాపింగ్ బొనాంజా మొదటి రోజు లక్కీ డ్రా విజేతలను వినియోగదారులతో ఎంపిక చేశారు. మొదటి బహుమతిని మానేపల్లి చందానగర్ బ్రాంచ్‌లో బంగారు ఆభరణాలు కొనుగోలు చేసిన సాయి (కూపన్ నం. 014204), ద్వితీయ బహుమతిని అమీర్‌పేట్ కేఎల్ఎం షాపింగ్ మాల్‌లో వస్త్రాలు కొనుగోలు చేసిన అనూష (041504), మూడో బహుమతిని కున్ హుందైలో కారు కొనుగోలు చేసిన చిట్టి ఇందు (018865) గెల్చుకున్నారు. ఈ నెల 9వ తేదీ వరకు జరిగే దసరా షాపింగ్ బొనంజాను గ్రేటర్ వినియోగదారులు నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడేలోని దసరా షాపింగ్ బొనాంజ ప్రకటనలను చూసి ఎంపిక చేసిన ఔట్‌లెట్‌లలో షాపింగ్ చేసి బహుమతులు గెల్చుకోవాలని ఏడీవీటీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాజిరెడ్డి తెలిపారు.

### లక్ష్మీ రూపంలో బంగారం..



నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే సంయుక్తాధ్వర్యంలో దశాబ్ద కాలంగా దసరా షాపింగ్ బొనాంజా నిర్వహించడం గొప్ప విషయం. అందులో మానేపల్లి భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉంది. దసరా పండుగ సందర్భంగా షాపింగ్ చేయడం తెలుగు వారి సంప్రదాయం. దసరా లక్ష్మీ బంగారం రూపంలో కొనుగోలు చేయడం ఆనవాయితీ. ఈ పండుగ సందర్భంగా బంగారు ఆభరణాలను కొనుగోలు చేస్తే శుభసూచికంగా భావిస్తారు.

*– మెండు రాజేశ్, స్టోర్ మేనేజర్, మానేపల్లి జ్యువెల్లరీస్*

### వినియోగదారులకు అనుగుణంగా..



దసరా సందర్భంగా మానేపల్లిలో బంగారు ఆభరణాలు కొనుగోలు చేయడం వినియోగదారులు సెంటిమెంట్‌గా భావిస్తారు. మానేపల్లిలో వినియోగదారులను ఆకట్టుకునే విధంగా వారి అభిరుచులకు అనుగుణంగా అన్ని రకాల బంగారు, వెండి, వజ్రాభరణాలు అందుబాటులో ఉన్నాయి. మానేపల్లిలో షాపింగ్ చేస్తే నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే దసరా షాపింగ్ బొనంజా ద్వారా మరిన్ని విలువైన బహుమతులు సొంతం చేసుకోవచ్చు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

*– గన్నోజు రాజు, స్టోర్ మేనేజర్*

# మూసీ పరీవాహక వాసులు ఆందోళన చెందొద్దు

హయత్‌నగర్, అక్టోబర్ 2 : నియోజకవర్గంలోని మూసీ పరీవాహక ప్రాంత నివాసితులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ఇండ్లను కూల్చాలంటే అధికారులు ముందుగా మమ్ములను దాటుకొని రావాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి భరోసానిచ్చారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చైతన్యపురి, కొత్తపేట డివిజన్ల పరిధిలోని మూసీ పరీవాహక కాలనీవాసులైన భవానీనగర్, ద్వారకాపురం, గణేశ్‌పురి కాలనీ, ఇంద్రానగర్, ఫణిగిరి కాలనీ, మారుతీనగర్, వినాయకనగర్, సత్యనగర్, బృందావన్ కాలనీలవాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మూసీ పరీవాహక ప్రాంతవాసులు ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అధికారులు ఏ ఒక్క ఇంటిని కూడా ముట్టుకోనియమని, ఇక్కడ నివసించే కాలనీల ప్రజలు ఎవరూ భయభ్రాంతులకు గురికావద్దన్నారు. తాను ఉన్నంత వరకు ఎలాంటి హానీ జరగనీయనని, ఎల్లవేళలా మీకు తాను అందుబాటులో ఉంటానని హామీనిచ్చారు. 2020లో ఎంఆర్‌డీసీఎల్ చైర్మన్‌గా తాను ఉన్నప్పుడు మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రారంభించామని, మూసీ బెడ్లపై కొన్నివేల కోట్ల రూపాయలతో 32 ఎస్టీపీ ప్లాంట్లను ఏర్పాటు చేశామని వివరించారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ 50 మీటర్ల బఫర్ జోన్ నిర్ణయిస్తే చాలా మంది ఇళ్లు కోల్పోతారని తెలుపగా దాని నిర్ణయం వెనక్కి తీసుకున్నారని తెలిపారు. మాజీ కార్పొరేటర్లు జిన్నారం విఠల్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, డివిజన్‌ల అధ్యక్షులు తోట మహేశ్ యాదవ్, లింగాల రాహుల్ గౌడ్, సొంటి చంద్రశేఖర్‌రెడ్డి, త్రివేది, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

## దళితుల ఇండ్లను కూల్చితే సహించం

హిమాయత్‌నగర్,అక్టోబర్2: హైడ్రా పేరుతో దళితుల ఇండ్లను కూల్చివేయాలని ప్రభుత్వం కుట్రలు చేస్తుందని తక్షణమే కూల్చివేతలను నిలిపివేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుల నాయకత్వంలో హైడ్రా పనిచేస్తుందని వారు బడా వ్యాపారుల వద్ద కోట్ల రూపాయలను ముడుపులు తీసుకుని కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపు కుంటున్నారని ఆరోపించారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యా లయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులు, పేదల ఓట్లతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి వారికి ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ భూములు,నీటి కుంటలు,చెరువులు, రహదారులను ఆక్రమించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారాలను చేసుకునే వారిని వదిలిపెట్టి పేదలు కష్టార్జితంతో కట్టుకున్న ఇండ్లను కూల్చివేసి వారి జీవితాలను బుగ్గిపాలు చేయడం అత్యంత దారుణమన్నారు. సమావేశంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు సిలివేరి వసంత రావు, పార్టీ గ్రేటర్ కార్యనిర్వాహక అధ్య క్షుడు చిప్పరి సుబ్బారావు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్.రాజు,జాతీయ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ భాస్కర్ రావు,నాయకుడు సుచంద్ర పాల్గొన్నారు.



రామంతాపూర్ కేసీఆర్‌నగర్‌లో మూసీ వద్ద ఇండ్లను పరిశీలిస్తున్న ఎమ్మెలే బండారి లక్ష్మారెడ్డి

# హైడ్రా బాధితులకు అండగా ఉంటాం

రామంతాపూర్, అక్టోబర్ 2 : మూసీ హైడ్రా బాధితులకు తాము అండగా ఉంటామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం రామంతాపూర్‌లోని కేసీఆర్‌నగర మూసీ పరీవాహక ప్రాంతాల్లో పర్యటించి బాధితుల ఇండ్లను పరిశీలించారు. బీఆర్ఎస్ తరుపున న్యాయపోరాటం చేస్తామన్నారు. తెలంగాణ ప్రజలకు ఏ కష్టమొచ్చినా గుర్తుకు వచ్చేది బీఆర్ఎస్ పార్టేనన్నారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్ననాగేశ్వర్‌రావు, నాయకులు పసుల ప్రభాకర్‌రెడ్డి, సర్వబాబు యాదవ్, జహంగీర్, చాంద్ పాషా, సూరంశంకర్, స్వామి, నరేశ్, మనీశ్, శ్రీనివాస్‌రెడ్డి, సాగర్, మహేందర్, సంధ్య, లక్ష్మి తదితరులు ఉన్నారు.

# నాబార్డ్ తెలంగాణ సీజీఎంగా ఉదయ్ భాస్కర్



చిక్కడపల్లి,అక్టోబర్2: తెలంగాణ నాబార్డ్ చీఫ్ జనరల్ మెనేజర్(సీజీఎం)గా ఉదయ్ భాస్కర్ నియమితులయ్యారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని నాబార్డ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లాకు చెందిన ఉదయ్ భాస్కర్‌కు డెలప్‌మెంట్ బ్యాంకింగ్ లో 31 సంవత్సరాల అనుభవం ఉంది. 1993 లో కర్ణాటకలో నాబార్డ్ లో చేరిన ఉదయ్ భాస్కర్ జార్ఖండ్, కర్ణాటక, ఏపీలోని ప్రాంతీయ కార్యాలయాల్లో, ముంబైలోని ప్రధాన కార్యాలయంలో వివిధ హోదాల్లో సేవలందించారు.



## వరద బాధితులకు సీఎంఆర్ విరాళం

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ) : వరద బాధితులను ఆదుకునేందుకు సీఎంఆర్ షాపింగ్‌మాల్ ముందుకు వచ్చింది. ఈ మేరకు సీఎంఆర్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ రూ.25లక్షల చెక్కును సీఎంఆర్ఎఫ్ ఫండ్ కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బుధవారం అందజేశారు. ఇటీవల వచ్చిన వరదల్లో నష్టపోయిన ఖమ్మం జిల్లా పరిసర ప్రాంత బాధితులను ఆదుకునేందుకు గాను ఈ సాయం అందజేసినట్లు వెంకటరమణ తెలిపారు.

## చేనేత కార్మికులకు ప్రభుత్వ ప్రోత్సాహం



చరఖాను తిప్పుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వెంగళరావునగర్, అక్టోబర్ 2 : చేనేత కార్మికులకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం అమీర్‌పేట్ కమ్మసంఘంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్పెషల్ ఈవెంట్ ఎక్స్‌పో పేరిట ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మినిస్ట్రీ ఆఫ్ టెక్స్ టైల్స్ వీవర్స్ సర్వీస్ సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందన్నారు. కమ్మసంఘం ఫౌండర్ సీవీ రావు,స్టేట్ హ్యాండ్లూమ్ అడిషనల్ డైరెక్టర్ వెంకటేషం, శ్రీజన్ సిల్క్ ఇండస్ట్రీస్ ప్రతినిధి శివకుమార్, పోచంపల్లి కోఆపరేటివ్ బ్యాంక్ ప్రెసిడెంట్ రమేశ్ పాల్గొన్నారు.



## మహాత్ముడికి గవర్నర్ నివాళులు

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ) : జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బాపూఘాట్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## టీఎన్‌జీవో కాలనీలో బతుకమ్మ సంబురాలు



గచ్చిబౌలిలోని టీఎన్‌జీవో కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# సనత్‌నగర్ గూడ్స్‌షెడ్ తరలింపు పరిశీలించండి

- రైల్వే అధికారులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 2, నమస్తే తెలంగాణ : స్థానిక సనత్ నగర్ లోని రైల్వే గూడ్స్ షెడ్ తరలింపుపై 2009, 2016లో దక్షిణ మధ్య రైల్వే డివిజన్ ఆపరేషనల్ సీనియర్ మేనేజర్ చేసిన సిఫారసులను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని కేంద్ర రైల్వే శాఖను హైకోర్టు ఆదేశించింది. సిఫారసులను పరిశీలించి నిర్ణయం తీసుకునే ముందు రైల్వే శాఖ విధానాలను పరిగణనలోకి తీసుకోవాలన్నది. సనత్ నగర్ గూడ్స్ షెడ్ ప్రత్యామ్నాయ స్టేషన్‌కు తరలించేలా ఆదేశాలివ్వాలంటూ ఉదయ్ కుమార్ మరో ఇద్దరు హైకోర్టును ఆశ్రయించారు. ఆ వ్యాజ్యాన్ని జస్టిస్ నగేశ్ భీమపాక ఇటీవల విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరపు న్యాయవాది ఎస్ శ్రీధర్ వాదనలు వినిపిస్తూ రైల్వే నిర్వహించే గూడ్స్ షెడ్ కార్యకలాపాల వల్ల రద్దీ పెరిగిందన్నారు . నిత్యం వాహనాల రాకపోకలతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. గతంలో అది శివారు ప్రాంతమని ఇప్పుడు హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉందని చెప్పారు. దానికి ప్రత్యామ్నాయాలను ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించిందని , 2009లో, 2016లో సనత్‌నగర్ కార్యకలాపాలను మౌలాలి, చర్లపల్లి నాగలపల్లి శంకరపల్లి స్టేషన్లకు తరలించాలని రైల్వే సీనియర్ డీఎం సిఫార్సు చేశారని వివరించారు. ఇప్పటివరకు ఆ సిఫార్సులు అమలు కాలేదని తెలిపారు. ఇరుపక్షాల వాదనలను, రికార్డులను, స్థానికులు, ప్రజాప్రతినిధుల వినతి పత్రాలు పరిశీలించిన హైకోర్టు రద్దీ ఉన్న షెడ్లకు ప్రత్యామ్నాయం చూడాలని, దానికి ప్రోత్సాహకాలు ప్రకటించాలన్న విధాన నిర్ణయాన్ని రైల్వే శాఖ తీసుకుందని గుర్తుచేసింది. కాబట్టి సనత్ నగర్ గూడ్స్ షెడ్ తరలింపుపై గతంలో రైల్వే డివిజనల్ సీనియర్ మేనేజర్ చేసిన సిఫారసులను పరిశీలించి చట్ట ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. పిటిషన్ పై విచారణ ముగుస్తున్నట్టు ప్రకటించింది.

# కొనసాగుతున్న కూల్చివేతలు

మూసీ పరీవాహక ప్రాంతాలు మూసానగర్, శంకర్‌నగర్‌లో బుధవారం ఇండ్లను నేలమట్టం చేశారు. చైతన్య నగర్‌లో తమ ఇండ్లను కూల్చొద్దని మహిళలు దిష్టి తీశారు.
– సిటీబ్యూరో, అక్టోబర్ 2 ( నమస్తే తెలంగాణ )







వివరాలను వెల్లడిస్తున్న ముప్పా ప్రాజెక్ట్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కోడటి రాజశేఖర్, సతీశ్

## గచ్చిబౌలిలో 'డోలా రే డోలా' దాండియా

శేరిలింగంపల్లి, అక్టోబర్ 2: దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ హాలులో డోలా రే డోలా దాండియా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు 10 రోజులపాటు ఈ వేడుకలు నగరవాసులకు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు ముప్పా ప్రాజెక్ట్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కోడటి రాజశేఖర్, కకర్ల సతీశ్ పేర్కొన్నారు. బుధవారం గచ్చిబౌలిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ముప్పా ప్రాజెక్ట్స్, కోకాకోలా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ దాండియా వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముంబై నగరానికి చెందిన ప్రముఖ డిజే ఆర్టిస్టులు ఫ్లోజా చౌదరి, డీజే కిమ్‌లు సంగీత ప్రియులను అలరిస్తారన్నారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన నగరవాసులు నామమాత్రపు రుసుంతో టిక్కెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. వివరాలకు 9010404040 నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

## స్వచ్ఛ భారత్‌లో రైల్వే స్టేషన్లకు ప్రాధాన్యత



రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేస్తున్న రైల్వే జీఎం అరుణ్ కుమార్‌జైన్, డీఆర్ఎం లోకేశ్ విష్ణోయ్

కాచిగూడ,అక్టోబర్ 2: స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో రైల్వే స్టేషన్‌లు, కార్యాలయాలు, రైలు బోగీలు, ఆసుపత్రులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛ భారత్ దివస్‌లో భాగంగా బుధవారం కాచిగూడ రైల్వేస్టేషన్‌లో స్వభావ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రైల్వే జీఎం అరుణ్ కుమార్‌జైన్ పాల్గొని కాచిగూడ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలను ఆధునీకరించడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే అదనపు జీఎం నీరజ్ అగర్వాల్,డీఆర్ఎం లోకేశ్ విష్ణోయ్, మధుసూదన్‌రావు,జీఆర్ఎస్ రావు,ప్రదీప్‌కుమార్, సీపీఆర్వో శ్రీధర్,కాచిగూడ రైల్వే డైరెక్టర్ బాలాజీ,మేనేజర్ మీనా,సీహెచ్ఐ అర్వీన్‌కుమార్, శైలేందర్‌కుమార్, శ్రీనివాసులు, రంగనాథ్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి నుంచి చేప పిల్లల పంపిణీ

### ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్, అక్టోబర్ 2: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మూడో తేదీ నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాలలో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తెలిపారు. మొదటి విడుతగా కరీంనగర్, వరంగల్, జోగులాంబ, గద్వాల జిల్లాలలో పంపిణీ చేస్తారన్నారు. కరీంనగర్ ఎల్ఎండీ మిడ్‌మానేరు డ్యామ్ వద్ద రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఉచిత చేప పిల్లల పంపిణీని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల ఏడో తేదీ నాటికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఉచిత చేప పిల్లల పంపిణీ చేపడుతామని తెలిపారు. అన్ని జిల్లాల వారీగా ప్రతి జిల్లాకు డిప్యూటీ కలెక్టర్, పంచాయతీ రాజ్ అధికారి, జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారి ద్వారా కమిటీ వేసి అన్ని విధాలుగా పరిశీలించి ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రతిష్టాత్మకంగా చేప పిల్లలు పంపిణీ చేస్తున్నామన్నారు.